క్లుప్తంగా

లింగోద్భవస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వెలసియున్న శ్రీ లింగోద్భవస్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం స్లాబు పనులను బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు అహ్మద్‌హుస్సేన్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి సహకారంతో దేవదాయ శాఖ నుంచి కల్యాణ మండపం నిర్మాణం కోసం రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డీఈ జనార్థనరావు, ఏఈ చంద్రశేఖర్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, కనికిచర్ల వెంకటప్రసాద్, స్థానికులు ఉన్నారు.

వడ్రంగి అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆవిష్కరించారు. వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఎంఈవో నీలం దేవరాజు, వెల్లటూరు పంచాయతీ కార్యదర్శి ఎ.రామ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



కర్లపాలెం: శ్రీ మహాశాస్త స్వామి అయ్యప్ప ఆలయంలో గత 42 రోజులుగా జరుగుతున్న చద్ది పంపిణీ కార్యక్రమం(అన్నదానం)బుధవారంతో ముగిసింది. కర్లపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని 19 ఏళ్ల క్రితం నిర్మించి జనవరి 4వ తేదీన విగ్రహ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయంలో 41రోజుల పాటు అయ్యప్పస్వామి వారి అభిషేకాలు, అర్చనలు, పడి పూజలు నిర్వహిస్తూ అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు చద్దిపంపిణీ(అన్నదానం) చేస్తున్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో ప్రారంభించిన చద్ది పంపిణీ కార్యకరమం బుధవారంతో ముగిసింది. దాతల సహకారంతో స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరిగిన మహా అన్నదాన కార్యక్రమంలో సుమారుగా 5 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



తెనాలిఅర్బన్: 17వ వార్డులో నివాసముంటున్న వ్యక్తి ఎద్దు శివమణి పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు నోట్, కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు తదితర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. మనఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, నాయకులు మద్దినేని కిరణ్ బాబు, షేక్ హనీఫ్, సాయి, అత్తోట కిట్టు, సుధ, గోపి నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా రవికిషోర్



తెనాలి: తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా శొంఠి రవికిషోర్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేటలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం ఆవరణలో గల సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయనకు పోస్టల్ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. రవికిషోర్ తెనాలి పోస్టల్ డివిజనులోనే గతంలో పోస్టల్ అసిస్టెంట్‌గా, పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం విజయవాడ నార్త్ సబ్‌డివిజన్ ఏఎస్పీగా చేస్తూ, అడ్‌హాక్ ప్రమోషన్‌పై తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. తెనాలి డివిజను పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో అందుతున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తిచేశారు.

పండుగను తలపించిన పింఛన్ల పంపిణీ

హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, నాయకులు

బాపట్ల అర్బన్: రాష్ట్రంలో బుధవారం నుంచి పండుగ వాతావరణంలో పెంచిన పింఛన్ల పంపిణీ సాగుతుందని బాపట్ల శాసనసభ్యులు ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పులి శరత్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ ఒక అన్నగా, మేనమామగా, కొడుకుగా, మనవడిగా రాష్ట్ర ప్రజలకు సేవలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.2,750 సామాజిక పింఛన్‌ను రూ.3వేలకు పెంచి అందిస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేర్ రాణి, బాపట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఏవో జేబీఎస్ రజిని తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

జేసీ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్‌కలెక్టర్ చామకూరి శ్రీధర్

బాపట్ల: డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని జన్ భాగిదరి కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. జన్ భాగిదరి కార్యక్రమాల నిర్వహణ జిల్లా స్థాయి కమిటీ తొలి సమావేశం కలెక్టరేట్‌లోని జిల్లా సంయుక్త కలెక్టర్ ఛాంబర్లో జరిగింది. విజయవాడలోని స్వరాజ్ మైదాన్ లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. నాలుగో తేదీ నుంచి 8వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రాయింగ్, డిబేట్, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. ఏడు నుంచి 11వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలన్నారు. 9 నుంచి 18 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఫోటో ఎగ్జిబిషన్, లఘు చిత్రాలను ప్రదర్శించాలన్నారు. సామాజిక న్యాయంపై సంతకాల సేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. మారథాన్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె. రాజ దిబోరా, డీఈఓ రామారావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, కమిటీ సభ్యులైన సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జీవితం అనుసరణీయం



ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న బీసీ సంక్షేమసంఘం నాయకులు

బాపట్ల అర్బన్: బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా విద్యను బోధించిన సావిత్రీబాయి పూలే కృషి ఎనలేనిదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని విశ్వశాంతి స్కూల్ ప్రాంగణంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జయంతి, ఝాన్సీ, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాలమ్మను సత్కరించి సావిత్రీ బాయి పూలే మెమోంటోను బహుకరించారు. జిల్లా అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసమే మహాత్మ జ్యోతీరావు పూలే ఆయన సతీమణి సావిత్రీ బాయి పూలే పనిచేశారని కొనియాడారు. జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతి జనవరి 3న మహిళా దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, నేతలు రమేష్ గౌడ్, వీరమల్లు చంద్రమౌళి, ఎం. మాల్యాద్రి, నాగుర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఆదర్శప్రాయురాలు పూలే

భట్టిప్రోలు: దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయ్ పూలే నేటి మహిళా లోకానికి ఆదర్శమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలో సావిత్రీ బాయ్‌పూలే 193 వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై సావిత్రీబాయ్‌పూలే పోరాటం చేశారని అన్నారు. మహిళా విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శులు ఈడే శ్రీనివాసరావు, ఎస్ఎస్‌పీ రాజు, బీసీ నాయకులు దీపాల శివప్రసాద్, కూరపాటి రఘురామయ్య, యశోదకృష్ణ, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



అయోధ్య అక్షింతలు తీసుకెళ్తున్న గ్రామపెద్దలు

పిట్టలవానిపాలెం: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి చేరుకున్న అక్షింతలను ప్రతి ఇంటికీ చేర్చాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి వక్కలగడ్డ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని చందోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వివిధ ప్రసార సాధనాల ద్వారా ఈ బృహత్కార్యాన్ని వీక్షించి ఈ అక్షింతలను ప్రతి ఒక్కరూ తలపై జల్లుకోవాలని కోరారు. శ్రీరామ నామస్మరణ చేయాలని కోరారు. కోమలి, సంగుపాలెం,చందోలు, భవనంవారిపాలెం, చోడిపాలెం గ్రామాలకు చెందిన గ్రామపెద్దలకు అయోధ్య అక్షింతలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, బండ్లమ్మ కమిటీ ధర్మకర్తల మండలి సభ్యులు బుడ్డా వెంకటలక్ష్మి, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తెనాలి శాఖ ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు

తెనాలి: భారత ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖను తెనాలిలో నెలకొల్పింది. కొత్తపేటలోని టీబీ రోడ్డులో ఉప్పల వరదరాజులు షాపింగ్ కాంప్లెక్సులో ఏర్పాటైన తెనాలి శాఖ బ్యాంకును మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ప్రారంభించి, జ్యోతిప్రజ్వలన చేశారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ లాకర్ విభాగాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ చిన్న బ్యాంకుల్లో ఖాతాదారులకు సత్వరం సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. పేదవర్గాలకు రుణసహకారం కూడా లభిస్తుందన్నారు. మున్సిపాలిటీ తరఫున సహకారం అందిస్తామని హామీనిచ్చారు. బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ జోనల్ పరిధిలో తమ 41వ శాఖను తెనాలిలో ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. బంగారు ఆభరణాల రుణాలతో సహా గృహరుణాలు, విద్యారుణాలు, వాహన రుణం వంటి అన్ని రుణ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. డిప్యూటీ జోనల్ మేనేజరు ఎ.రజనికుమార్, శశి గ్రూప్స్ అధినేతలు వుప్పల వరదరాజులు, వుప్పల అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాది తాడిబోయిన బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు. బ్యాంక్ తెనాలి శాఖ మేనేజరు డి.సాయినవీన్ పర్యవేక్షించారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందులపేట భాస్కరరావు దిబ్బకు చెందిన కోడూరి అనసూయ(60) భర్త మృతి చెందడం, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. ప్రైవేటు చిట్టీలు నిర్వహించే ఈమె ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు బుధవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పింఛన్ పంపిణీ వాయిదా

భట్టిప్రోలు: భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం నిర్వహించతలపెట్టిన నూతన పింఛన్ల పంపిణీ వాయిదా పడినట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు బుధవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు ఈ మార్పుని గమనించాలని పేర్కొన్నారు.

వెల్లటూరు పురవీధుల్లో శోభాయాత్ర

వెల్లటూరు(భట్టిప్రోలు): అయోధ్య రామ మందిర ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా రామ మందిర నిర్మాణ తీర్థ ట్రస్ట్ ద్వారా వచ్చిన అక్షింతలు పంపిణీ కార్యక్రమం బుధవారం మండలంలోని వెల్లటూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా పురవీధులలో రామనామం జపిస్తూ శోభా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు, బీహెచ్ నరసింహారావు, డి. ప్రసాద్, ఎ.సుధాకరరావు, అర్చకులు మారుతీ సత్యసాయి, హరే శ్రీనివాస భజన మండలి సభ్యులు ఎస్.పద్మజ, పద్మారాణి, వసుంధర, మాధవి, భక్తులు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ




రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను అంతా సద్వినియోగం చేసుకోవాలని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్‌ను బుధవారం చినరావూరులో ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషలిస్టు వైద్యులు అక్కడ సేవలు అందించారు. మెడికల్ క్యాంప్‌కు వచ్చిన ఆమె అక్కడ అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులను ఇక్కడకు తీసుకొచ్చి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జనరల్ ఓపీలో 62 మందికి , గైనిక్-22, జనరల్ మెడిసిన్-54 మందికి వైద్య సేవలు అందించినట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల తెలిపారు. అనంతరం రోగులకు మెడిసిన్ కిట్‌లను డాక్టర్ అన్నపూర్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొర్రా యశోద, వైద్యులు డాక్టర్ దివికృష్ణ కిషోర్, డాక్టర్ పి ఉషారాణి, డాక్టర్ వి లిఖిత, డాక్టర్ టి వినీల్, డీపీఎంవో జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైకులు చోరీ చేస్తున్న యువకులపై కేసు

తెనాలిరూరల్: బైకులు చోరీ చేస్తున్న ముగ్గురు యువకులపై కేసులు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు యువకులు మంగళవారం అర్ధరాత్రి దాటాక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు అపహరించారు. గంగానమ్మపేట తోటకూర సుబ్బారావు నాయుడు హైస్కూలు వద్ద మరో బైక్ అపహరించేందుకు యత్నిస్తుండగా స్థానికులు గమనించి కేకలు వేయడంతో పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం రాత్రి తెలిపారు. నిందితుల్లో ఒక యువకుడి ఆచూకీ ఇప్పటికే పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది



ఉపాధ్యాయురాలు మల్లేశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువరానిదని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ పేర్కొన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించారు. ముందుగా సావిత్రీ బాయ్ పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ మాట్లాడుతూ సావిత్రీబాయ్ పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకోవటం జరుగుతుందని చెప్పారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయురాలు రామిశెట్టి మల్లేశ్వరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చుక్కా భానుప్రసాద్, కాసరనేని శ్రీనివాసరావు, పొట్టి నరేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతికి అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో తీర్మానం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కర్లపాలెం: బాపట్ల నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని బాపట్ల ఎమ్మెల్యేగా కోన రఘుపతిని అధిక మెజార్టీతో గెలిపించుకుని సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంగా చేసుకుందామని బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీతారామిరెడ్డి మాట్లాడుతూ సాధారణ వ్యక్తులు వైఎస్సార్ సీపీలోకి వచ్చిన తరువాతే పదవులు పొంది నాయకులయ్యారని అలాంటి వారు ఒకరిద్దరు పార్టీని వీడినా ఎలాంటి నష్టం జరగదని చెప్పారు. వైస్ ఎంపీపీ సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోన రఘుపతి 2024లో జరగనున్న ఎన్నికలలో మూడోసారి గెలిచి హాట్రిక్ సాధిస్తారని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి పరమానందకుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎమ్మెల్యే కోన చేస్తున్న అభివృద్ధి పనులే తిరిగి ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని చెప్పారు. పార్టీ కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి టీడీపీలోకి వెళ్ళటం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన వారు ఆ పదవులకు రాజీనామా చేసాకే వేరే పార్టీల్లోకి వెళ్ళాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు సాగర్, జేసీఎస్ కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు లలిత కుమారి, కరుణకుమారి, శ్రీనివాసరెడ్డి, నాని, వెంకటేశ్వర్లు, నాగాంజనేయులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ సామ్రాజ్యం, నాగలక్ష్మి, ఆసిఫ్ అలీ, లక్ష్మణరావు, సుబ్బారెడ్డి, అమీర్‌బేగ్, నాయకులు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భావన్నారాయణ, నాగరాజు, రామచంద్రారెడ్డి, సురేష్, సుబ్బారావు, రవి, జగ్గయ్య, సత్యానారాయణరెడ్డి, కరిముల్లా, తాజుద్దీన్, ప్రసాద్, హరిబాబురెడ్డి, బెనర్జి, సుభాష్ చంద్రబోస్, మనోహర్, షంషీర్, ఇమ్రాన్, గిరిబాబురెడ్డి తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో అలరించిన గీతాపారాయణం



గీతాపారాయణం ఆలపిస్తున్న బ్రహ్మవిద్యాశ్రమం సభ్యులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో నిర్వహిస్తున్న 79వ ధనుర్మాస జయంతి వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారు జామున ఓంకారం, నగర సంకీర్తన, సుప్రభాతం, కాకడ హారతి నిర్వహించారు. సాయినాథుని పాదుకలకు అభిషేకములు, నాగవల్లి దళాలతో సహస్ర నామార్చన చేశారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం వారిచే గీతాపారాయణం జరిగింది. హేమ వితలేశ్వరస్వామి దేవస్థానమునకు చెందిన బాలా త్రిపురసుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో షిర్డీసాయి బాబా వారి జీవిత చరిత్రలోని కొన్ని అంశాలు వివరించారు. వేంకటేశ్వర స్వామివారి స్తోత్రాలు, స్తుతులు, గేయాలు ఆలపించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం .సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

సొంత ఖర్చుతో రహదారికి మరమ్మతులు

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి సేవాభావం



రహదారి మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న వరికూటి

భట్టిప్రోలు: అధ్వానంగా మారిన భట్టిప్రోలు..పల్లెకోన రహదారి అభివృద్ధికి సొంత ఖర్చులతో మరమ్మతు పనులు నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న దృష్ట్యా వాహనదారుల ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మతు పనులను చేసేందుకు ఆయన సంకల్పించారు. ప్రొక్లెయినర్‌తో పనులు ప్రారంభించారు. ఆయన వెంట సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుధుల ఉదయభాస్కరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాస్ (నాని), మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చిన బుజ్జి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత ప్రభుత్వానిదే..

పిట్టలవానిపాలెం: ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలు నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు, పిట్టలవానిపాలెం గ్రామసర్పంచ్ అశ్వినిరెడ్డి అన్నారు. మండలంలోని పిట్టలవారిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సామాజిక పింఛన్లలను రూ.3 వేలకు పెంచి అందిస్తున్నారని అన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులకు ట్యాబులు అందించామని తెలిపారు.ఈ ట్యాబులను సక్రమంగా వినియోగించుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ట్యాబుల ద్వారా సాంకేతికంగా విద్యార్థులు మెరుగైన విద్య ను పొందడానికి వీలుటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటరెడ్డి, వలంటీర్ లు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకు లు యేట్ర శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాయిబాబా మందిరంలో ప్రతిష్ఠించబడిన దత్తాత్రేయస్వామి వారి సన్నిధిలో గురువారం అనఘాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు బుధవారం తెలిపారు. పూజల్లో భాగంగా సామూహిక దత్తాత్రేయ, అనఘాదేవి వ్రతములు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం దత్త అనఘాదేవి వ్రతం, మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

సామాజిక వర్గాల మధ్య కొట్లాటలో రాజీ యత్నాలు

కొల్లూరు : రెండు ఎస్సీ సామాజిక వర్గాల నడుమ చోటు చేసుకున్న కొట్లాట విషయంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు రాజీ ప్రయత్నాలు చేపట్టారు. సోమవారం రాత్రి మండలంలోని తోకలవారిపాలెం- కిష్కిందపాలెం గ్రామాలకు చెందిన రెండు సామాజిక వర్గాల నడుమ డీజే పాటల విషయంలో వివాదం చెలరేగి కొట్లాటలకు దారితీసిన విషయం విదితమే. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు సామాజిక వర్గాలకు చెందిన సంఘ పెద్దలతో మంగళవారం రాత్రి రేపల్లె డీఎస్పీ టి. మురళీకృష్ణ చర్చలు జరిపిన నేపథ్యంలో రెండు గ్రామాలకు చెందిన సంఘ పెద్దలు వివాదాల జోలికి వెళ్లమని హామీ ఇచ్చారు. గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొనే విదంగా వ్యవహరిస్తామని వారు డీఎస్పీకి తెలియజేయడంతో ఇరు గ్రామాల నడుమ మరో మారు చర్చలు జరిపి రాజీ చేసేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. బుధవారం డీఎస్పీ సమక్షంలో మరోమారు చర్చలు జరగాల్సి ఉన్నప్పటికీ ఆయన అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడినట్లు పోలీసులు తెలిపారు. చర్చలు పూర్తయ్యే వరకు రెండు గ్రామాలలో పోలీసు పికెట్ కొనసాగనున్నట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి బుధవారం రాత్రి నాలుగు క్వార్టర్ల మద్యం సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.